


## నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల

# షా



(చిత్రం:డా.దారా సురేంద్ర)



'షేక్స్‌పియర్, మిల్టన్ పుట్టిన ఇంగ్లాండ్‌లో పుట్టి, పెరిగి, కనీసం ఇంగ్లీష్ కూడా సరిగ్గా మాట్లాడలేదు. ఇలాటి అమ్మాయికి జీవించే హక్కు లేదు!'

'నార్వీజియన్స్ వాళ్ళ భాష చక్కగా మాట్లాడతారు. గ్రీకులు గ్రీకులోనే చదువుతారు. ఫ్రెంచ్ వాడు ఒక్క అక్షరం ముక్క కూడా పొల్లుపోకుండా ఫ్రెంచ్ నేర్చుకుంటాడు. మరి ఇంగ్లీష్ వాళ్ళు వాళ్ళ పిల్లలకి, ఇంగ్లీష్‌లో సరిగ్గా మాట్లాడటం ఎందుకు నేర్పరు?'

'నేను సామాన్య మానవుడిని. ఎలా బ్రతకాలనుకుంటున్నానో అలాగే బ్రతికే మామూలు మనిషిని. అటువంటిది జీవితంలోకి ఒక అమ్మాయి తెచ్చుకున్నామనుకో. ఇల్లంతా మళ్ళీ అలంకరిస్తానంటుంది. నువ్వేదో అనుకుంటే తను ఇంకేదో అంటుంది. కవిత్వం, భాషా నేర్పుదామనుకుంటే, ముందు ప్రేమించమంటుంది... అసలు ఆడవాళ్ళు మగవాళ్ళలా ఎందుకు వుండరు'

'ఆకాశంలో నక్షత్రాల గురించి నాతో మాట్లడకు. అనురాగం చూపించు. వసంతం గురించి చెప్పకు. ఒక్కసారి నన్ను దగ్గరికి తీసుకో చాలు. ప్రేమ శాశ్వతం అని కబుర్లు చెప్పకు. అది నీలో వుంటే నాకు చూపించు'

'నువ్వు లేకపోయినా ప్రతి సంవత్సరం వసంతం వస్తుంది. నువ్వు లేకపోయినా ఇంగ్లాండ్ కూడా ఎక్కడికీ పోదు. సంగీతంలాటి కళలన్నీ అలా నిలిచే వుంటాయి. నువ్వు లేక పోయినా నేను వుంటాను. ఓ నేస్తమా ఇక సెలవు!'

1960 జూన్ నించీ 1963 మే దాకా, నేను గుంటూరు హిందూ కాలేజీలో బి.ఎస్.సి. చదివాను. చదివింది లెఖ్ఖలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ అయినా, మాకు తెలుగు ఇంగ్లీషులో చాల పుస్తకాలు వుండేవి. నాకు ఆ రెండు భాషల మీదా వున్న అభిమానం, నా మీద నాకున్న అభిమానం కన్నా ఎక్కువ కనుక, నాకా మూడు సంవత్సరాలూ గొప్ప పండుగ క్రిందే లెఖ్ఖ.

తెలుగులో అల్లసాని పెద్దనగారి మనుచరిత్ర, కాటూరి-పిల్లలమర్రి వెంకటేశ్వ్రరావుగార్ల సాహిత్య సమాలోచనం, నండూరి రామకృష్ణమాచార్యగారి ఛత్రపతి శివాజీ... ఇలా ఎన్నో గొప్ప పుస్తకాలు చదివే అదృష్టం కలిగింది. అందులోనూ పాఠాలు చెప్పింది ఎక్కిరాల కృష్ణమాచార్యలాటి దిగ్గజాలు.

అలాగే ఇంగ్లీష్ సాహిత్యం కూడాను. షేక్స్‌పియర్ వ్రాసిన మేక్బెత్, సింబలీన్, మిల్టన్ వ్రాసిన పారడైజ్ లాస్ట్, బెర్నార్డ్ షా పిగ్మాలియన్ ఎంతో సరదాగా వుంటే, విలియం సారాయన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ హ్యూమానిటీ, సర్వేపల్లి రాధాకృష్ణన్‌వారి పుస్తకం (పేరు మరిచిపోయాను) పరీక్షల్లో కొంచెం కలవరపెట్టాయి. చంద్రన్‌గారు కొంచెం భయపెడితే, అమరేంద్రగారు అలరిస్తే, టివిజి కృష్ణమూర్తిగారు నాటకాలని నటిస్తూ చెబుతుండేవారు. అసలు ఆయనే నాకు నాటకాల మీద, వేయటమే కాక వ్రాయటం కూడా, ఉత్సాహం కలిగించారేమో! ఆ రోజుల్లో -

ఆయన విజయవాడ రేడియో స్టేషన్నించి ఒక ఆదివారం వచ్చిన మేక్బెత్‌లో నటించారు కూడాను. మంచి గంభీరమైన గొంతు. వాచికం. నటన. ఆయన క్లాసులో పాఠం చెబుతుంటే, ఏకసంథాగ్రాహిలా, అప్పటికప్పుడే నోటికి వచ్చేవి పిగ్మాలియన్ డైలాగులు. ఆ పుస్తకం మొదటి పేజీ నించీ చివరి పేజీ దాకా బట్టీ పట్టేశాను. ఒకటి ఆయన కలిగించిన ఉత్సాహం అయితే, రెండవది జార్జ్ బెర్నార్డ్ షా వ్రాసిన తీరు. నాటకీయత. భాషా ప్రావీణ్యం. అన్నీ కలిపితే, ఒక గొప్ప నాటక రచయిత రచనా నైపుణ్యం. అవీ నన్ను ఆ నాటకంతో అనుబంధం పెంచుకునేట్టు చేసినవి. ఆ పుస్తకంలోని ఎన్నో సన్నివేశాలూ, మాటలూ, ఆనాటి భట్టీయం ఈనాటికీ అవి మరిచిపోకుండా చేసింది.

తర్వాత ఇంజనీరింగ్ చదువుతుండగా, ఎడ్యుకేషన్ టూర్‌లో మద్రాస్ (ఈనాటి చెన్నై)కి వెళ్ళాం. అక్కడ 70 మిల్లీమీటర్లలో ఆనంద్‌లోనో, సెఫైర్‌లోనో నడుస్తున్నది పిగ్మాలియన్ ఆధారంగా తీసిన 'మై ఫెయిర్ లేడీ'. అక్కడికి వెళ్ళిన వెంటనే, నేనూ నాలాంటి పిచ్చివాడు ఇంకొకడూ ఆ సినిమాకి పరుగెత్తాం.

ఆ సినిమా చూస్తున్నప్పుడు కలిగిన అనుభూతి, ఇంతవరకూ మరే సినిమా చూసినప్పుడూ కలగలేదు. సంగీత ప్రధాన చిత్రం. ఎంతో అహంకారం, ఇంగ్లీష్ భాష మీద పిచ్చి మమకారం వున్న ఫొనెటిక్స్ ప్రొఫెసర్ హెన్రీ హిగిన్స్ పాత్ర వేశాడు రెక్స్ హారిసన్. మురికివాడల్లో పూలమ్ముకుని బ్రతికే ఒక స్వాభిమానం కలిగిన వనితగా ఆడ్రీ హెప్బర్న్. వాళ్ళు ఇద్దరూ నా అభిమాన నటులే. ఆండ్రే పర్విన్ సంగీతం. అన్నిటికీ మించి బెర్నార్డ్ షా వ్రాసిన నాటకాన్ని యధాతథంగా చిత్రించి తీరు. అన్నీ కలిపి ఒక గొప్ప కళాఖండం. 1964 సంవత్సరంలో విడుదలయిన సినిమాల్లో మై ఫెయిర్ లేడీ ఉత్తమ చిత్రంతో సహా 8 ఆస్కారులూ, ఇంకో పన్నెండు తదితర బహుమతులూ సంపాదించింది.

ఈ వ్యాసం మొదట్లో వ్రాసిన కొన్ని మాటలు చదివి, ఇవి పిగ్మాలియన్‌లోని డైలాగులు అని తెలియనివారు ఇవేమిటి ఇక్కడికొచ్చాయి అనుకుని ఉండవచ్చు.

మొదటి మూడు పేరాగ్రాఫుల్లోనూ - ఇంగ్లీష్ భాష అంటే పడి చచ్చేవాడూ, స్వతహాగా అహంకారీ, తన భాషా పరిశోధనలో మునిగిపోయి ఎదుటు మనిషి విలువ కూడా గ్రహించలేని ప్రొఫెసర్ హిగిన్స్‌వి. ఆ పాత్రలో కొంతవరకూ బెర్నార్డ్ షా కనపడతాడని అంటారు. నిజానిజాలు నాకు తెలీదు.

మిగతా రెండు పేరాగ్రాఫుల్లోనూ చెప్పిన మాటలు ఒక పూలమ్ముకునే అతి సామాన్యమైన యువతివి. సున్నితమైన మనస్థత్వం, ఆత్మాభిమానమే ఆస్థిగా చూసుకునే పాత్ర ఎలీజా డూలిటిల్. ఆడ్రీ హెప్బర్న్ జీవం పోసిన పాత్ర. నటనకి నిర్వచనం చెప్పిన పాత్ర.

ఆ సినిమాని తర్వాత నేను ఎన్నిసార్లు చూశానో చెబితే నన్నో పిచ్చివాడిగా లెఖ్ఖకడతారు మీరు. అందుకని చెప్పను. తెలుగులో ఆనాటి గురజాడ మీద ఎంత అభిమానం వుందో, నాకు ఇంగ్లీషులో షా అంటే అంత వుంది.

ఈమధ్య ఎవరో అడిగారు - వారి ప్రభావం మీ రచనల్లో వుందా అని. నాది అప్పుడూ ఇప్పుడూ ఒకే సమాధానం 'నాకంత అదృష్టం కూడానా' అని.

ఈ వ్యాసం బెర్నార్డ్ షా జోకుతో సమాప్తం చేస్తాను.

బెర్నార్డ్ షా ఇంటికి వచ్చిన ఒక మిత్రుడు, ఇంట్లో ఎన్నో మంచి మంచి పుస్తకాలు నేల మీదా, సోఫాల్లోనూ ఎక్కడపడితే అక్కడ వుండటం చూసి, ఆయన్ని అడిగాడుట.

'అయ్యా షాగారూ! ఎంతో అరుదైనవీ ఖరీదైనవీ ఇన్ని పుస్తకాలు ఇలా పారేశారేమిటి. చక్కగా బుక్ షెల్ఫుల్లో పెట్టకపోయారా' అని.

దానికి షా పాదుషాలాగ నవ్వి - 'పుస్తకాలంటే ఎవరి దగ్గరయినా అరువు తీసుకుని, తిరిగి ఇవ్వటం ఎగ్గొట్టచ్చు. పుస్తకాల షెల్ఫులెవ్వరూ అరువివ్వరే!' అన్నాడుట.

అంతెందుకు మన ఆరుద్రగారు అన్నారుగా కూనలమ్మ పదాల్లో, 'అరువిచ్చిన బుక్కు, తిరిగొస్తే గొప్ప లక్కు' అని. **